## క్లుప్తంగా

### జమ్మలమడుగు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తిరుపతయ్య

**జమ్మలమడుగు రూరల్ :** మైలవరం తహసీల్దార్ తిరుపతయ్యకు జమ్మమడుగు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. జమ్మలమడుగు తహసీల్దార్ రవీంద్రారెడ్డి సెలవుపై వెళ్లడంతో.. ఆయనకు బాధ్యతలు అప్పగించారు. దీంతో తిరుపతయ్య శనివారం జమ్మలమడుగు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

### రాజీ మార్గమే ఉత్తమం



మాట్లాడుతున్న జడ్జి ఫకృద్దీన్

**జమ్మలమడుగు :** చిన్న, చిన్న కేసుల్లో రాజీ మార్గమే ఉత్తమమైనదని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫకృద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులు, నిందితులు కోర్టు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, ఇరువురు ఒప్పందానికి వచ్చి రాజీ మార్గం ఎంచుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఇందుకోసం వచ్చే నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

### నేడు ఉప్పలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**జమ్మలమడుగు :** మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు గురప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని ఆయన పేర్కొన్నారు. చిన్న, చిన్న సమస్యలను అక్కడికక్కడే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారని వివరించారు. కావున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

**పెద్దముడియం :** పెద్దపసుపుల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ పాఠశాలలో వారిని శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉషశ్రీ, మౌనిక, సుజిత, సుమిత్ర పోటీలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. వీరు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అంకాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్లౌడ్ టెక్నాలజీపై అవగాహన

**పులివెందుల టౌన్ :** విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీపై వెన్నపూస సూర్యారెడ్డి అమెరికాలోని న్యూజెర్సీ నుంచి జూమ్ యాప్ ద్వారా అవగాహన కల్పించారు. శనివారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో 1992–95వ బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థి న్యూజెర్సీ నుంచి వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లౌడ్ టెక్నాలజీ అనే స్టాఫ్‌వేర్ టెక్నాలజీ అంశం మీద అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ అమల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో మంచి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, అధ్యాపకుడు రమణారెడ్డి, అధ్యాపకురాలు శోభ, విద్యార్థులు పాల్గొన్నారు.

### 30న మధ్యాహ్న భోజన పథకం వంట బంద్

**వేంపల్లె :** ఈనెల 30వ తేదీన మధ్యాహ్న భోజన పథకం ద్వారా చేస్తున్న వంటను బంద్ చేస్తున్నట్లు వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చాంద్ బాషా పిలుపునిచ్చారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పథకం పేరును జగనన్న గోరు ముద్ద మార్పుపై ఉన్న శ్రద్ధ, విద్యార్థులకు చెల్లించే మెను చార్జీలు, కార్మికులకు ఇచ్చే వేతనాలను చెల్లించకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ కార్మికులు ఖదిరున్నిషా, వరలక్ష్మి, గౌసియా, ఫర్జాన, దస్తగిరి, చాంద్ బాష, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

**సింహాద్రిపురం :** మండలంలోని ప్రజలు వ్యక్తిగత నూతన మరుగుదొడ్ల కోసం గ్రామ పంచాయతీ సెక్రటరీ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్ల క్రితం నిర్మించుకున్న మరుగుదొడ్లకు బిల్లులు పడని వారు కూడా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పేర్లను సోమవారం లోపు నమోదు చేసుకోవాలన్నారు. మండల ప్రజలు నూతనంగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు.

# నవరత్నాలతో ఇంటింటా సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి
- వలసపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం నెలకొందని ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రగుంట్ల మండలంలోని వలసపల్లె గ్రామంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి బాలయ్యతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలు ఉన్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకువెళ్లగా, వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు పథకాలను అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆ దిశగా ఆయన పరిపాలన కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చి, చరిత్ర సృష్టించారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చేందుకు ఆవిష్కరించిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరు వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ సూర్యనారాయరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సుబ్బయ్య, సీఐ మంజునాథ్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్థాయిని మించి మాట్లాడటం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కమలాపురం :** టీడీపీ నాయకులు స్థాయిని మించి మాట్లాడటం తగదని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సాధిక్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చెబుతున్న ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే రైతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నారన్నారు. రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రతి 2 వేల జనాభాకు ఒక ఆర్‌బీకే నిర్మించి, వాటి ద్వారానే అన్ని రకాల సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆర్‌బీకేలను సందర్శించడానికి దేశంలోని అన్ని రాష్ట్రాల మంత్రులు, వ్యవసాయాధికారులు వస్తున్నారని, పరిశీలించి కితాబిస్తున్నారని వివరించారు. అలాంటి ఆర్‌బీకేలను టీడీపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారని, ఏప్రిల్ నుంచి రైతుల పొలాలకు సంబంధించిన భూసార పరీక్షలన్నీ నియోజకవర్గ కేంద్రాల్లోనే చేస్తారన్నారు. భూరక్ష పథకం ప్రారంభించి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రవి శంకర్, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, నారపురెడ్డి, చంద్రపాల్ పాల్గొన్నారు.

## బోడుతిప్పలపాడు గ్రామాభివృద్ధికి చర్యలు



ఎన్నారై సదాశివారెడ్డితో సమావేశమైన అధికారులు

**పెద్దముడియం :** మండలంలోని బోడుతిప్పలపాడు గ్రామస్తుడు, అమెరికాలో స్థిరపడిన తేగల పల్లె సదాశివారెడ్డి గ్రామ అభివృద్ధి కోసం నిధులు అందజేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజును కలిసి వారం రోజుల క్రితం తెలియజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల ప్రకారం శనివారం ఆర్డీవో శ్రీనివాసులు, డీపీవో ప్రభాకర్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి గ్రామంలో ఉన్న ఎన్నారై సదాశివారెడ్డి, గ్రామస్తులను కలిసి గ్రామ అభివృద్ధిపై చర్చించారు. నాలుగు రోజుల్లో గ్రామానికి సంబంధించిన రోడ్లు, డ్రైనేజీ, ఇతర సదుపాయాల గురించి ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో వెంకటరమణయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

రూరల్ సీఐ బాలమద్దిలేటి



అంబకపల్లెలో పర్యటిస్తున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి, పోలీసు సిబ్బంది

**లింగాల :** ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ బాలమద్దిలేటి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ, ఎస్ఈబీ ఎస్పీల ఆదేశాల మేరకు శనివారం లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో పోలీసుల నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రతి అణువూ పరిశీలించడంతోపాటు అనుమానాస్పద ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నాటు సారా తయారీ, నేరాలు చేసిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం చట్టాల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, ఎస్ఐలు హృషికేశవరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, హనుమంతు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలపై వివక్ష తగదు



కమలాపురం : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వాణి


**కమలాపురం :** బాలికలపై వివక్ష చూపడం తగదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పెద్దచెప్పలి గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సూపర్‌వైజర్ మాట్లాడారు. 2015 జనవరి 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బేటి బచావో–బేటి పఢావో పథకాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మాయిల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లె :** బాలికలపై వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ వీరపునాయునిపల్లె సెక్టారు సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. యస్.పాలగిరి సచివాలయ పరిధి నేలతిమ్మాయపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. మగ, ఆడ అనే తేడా లేకుండా పిల్లలను చూసుకుంటామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, భవానీ, హెల్పర్ ఖాశీంబీ పాల్గొన్నారు.

**చెన్నూరు :** ఈ నెల 18 నుంచి 24 వరకు బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా చెన్నూరు మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం చెన్నూరులోని నాగలకట్టవీధి, పరమటవీధి అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఉమామహేశ్వరి, చంద్రకళ, వాసవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందని, దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, గుర్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పద్మావతి, రాధ, తులసి, పద్మ, ఇందిర, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి

ఏఓ రాజేంద్ర ప్రసాద్



పొలంబడి కార్యక్రమంలో ఏఓ, తదితరులు

**వేంపల్లె :** వరిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఇడుపులపాయ గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో వరి పంటను పరిశీలించి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సకాలంలో ఎరువులు, మందులు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు శంకరయ్య, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కు ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు, మానసిక వైద్య నిపుణురాలు హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగ పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కిడ్నీ వైవిద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర వాటికి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. డాక్టర్ వై.జి.హర్షవర్ధన్ రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునేవారు పరగడపున ఏమి తినకుండా రావాలన్నారు. అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### ధ్యానంతో సర్వరోగాలు దూరం

**పులివెందుల రూరల్ :** ధ్యానం సర్వరోగ నివారణి.. సకల దుఃఖ పరిహారిణి అని జెఎన్‌టీయూ అధ్యాపకురాలు శేష మహేశ్వరమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపల్ జీఎస్‌ఎస్ రాజు ఆధ్వర్యంలో రాజ యోగం – ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి రాధిక హాజరై తనను తాను తెలుసుకుని తన అభివృద్ధికి మార్గం సుగమం చేసుకోవడమే రాజయోగమన్నారు. ఏకాగ్రత సాధించాలంటే ప్రతి రోజు కనీసం 15 నిమిషాలు ధ్యానం చేయడం అలవరుచుకోవాలన్నారు. ధ్యానం చేయడంవల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

**వీరపునాయునిపల్లె :** మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి నివేదిక అందజేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు పేర్కొన్నారు. గ్రామాల నుంచి అందిన నివేదికకు అనుమతులు కోరుతూ జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపుతామన్నారు. అనుమతులు రాగానే మరుగుదొడ్లు నిర్మిస్తామని వివరించారు.

### నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

**వేంపల్లె :** స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆవోపా అధ్యక్షుడు పి.గోవర్ధన్ తెలిపారు. అవకాశాన్ని మండ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేముల :** మబ్బుచింతలపల్లె, వి.కొత్తపల్లె, పెర్నపాడు, నల్లచెరువుపల్లె 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాలలో ఉదయం 8.45 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### ముద్దనూరులో అంధకారం

**ముద్దనూరు :** ముద్దనూరుతోపాటు మండలంలోని 36 గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. మండల వ్యాప్తంగా నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాత్రి 9 గంటల వరకు కూడా కరెంటు రాలేదు. ఈ విషయంపై విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. మధ్యాహ్నం వరకు నిర్వహణ పనుల కారణంగా కరెంటు సరఫరా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. తర్వాత లైన్ టవర్స్‌లో సమస్యతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు. పునరుద్ధరణ కోసం సిబ్బంది, అధికారులు శ్రమిస్తున్నట్లు చెప్పారు.

## కూరగాయల మార్కెట్ నిర్మాణ పనుల పరిశీలన



కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

**పులివెందుల టౌన్ :** స్థానిక శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. మార్కెట్ ఆధునికీకరణ పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. అనంతరం అక్కడే ఉన్న వైఎస్సార్ మెమోరియల్ పార్కును తనిఖీ చేశారు. పార్కును పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గుర్రప్ప యాదవ్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఆర్డీఓ వెంకటేశులు



మాట్లాడుతున్న పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు

**పులివెందుల టౌన్ :** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పులివెందుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీఓ వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డిలతో కలిసి ఆయన రైతులు, ఇళ్లు, స్థలాలు కోల్పోయే యజయానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సర్వీసు రోడ్డు నిర్మాణం, విజయ హోమ్స్ నుండి బస్టాండు, బస్టాండు రోడ్డు నుండి రాణితోపు, పులివెందుల ప్రభుత్వాసుపత్రి నుండి ఉలిమెల్ల రింగ్ రోడ్డు సర్కిల్, పులివెందుల వెజిటబుల్ మార్కెట్ నుంచి పార్నపల్లె రింగ్ రోడ్డు వరకు రహదారులు విస్తరణకు సహకరించాలన్నారు. అలాగే అంబకపల్లె బైపాస్ రోడ్డు, గాంధీ సర్కిల్, పూలంగళ్ల సర్కిల్, బస్టాండు సర్కిళ్ల విస్తరణ కొరకు భూసేకరణ చేసే నిమిత్తం భూములు, నిర్మాణాలు నష్టపోయే యజమానులందరూ సహకరించాలని కోరారు. భూనిర్వాసితులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, ఆయా పరిధిలోని వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

**చెన్నూరు :** మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) ఏర్పాటు చేయడం జరిగిందని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేఓఆర్ కాలనీలో సామాజిక ఆరోగ్య కేంద్రం, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకే చోట ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇబ్బందులు ఉండేవని తెలిపారు. కాగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సహకారంతో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఇటు చెన్నూరు టౌన్, అలాగే మైనార్టీ కాలనీ, కొండపేట, బలసింగాయపల్లె, కనపర్తి తదితర గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఇక్కడ ఓపీతోపాటు అన్ని రకాల రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని, పీహెచ్‌సీలో లభించే అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి సోమవారం చర్మ వ్యాధుల డాక్టర్, జనరల్ మెడికల్ డాక్టర్ అందుబాటులో ఉంటారని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, మండల ప్రజలు పీహెచ్‌సీ వైద్య సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

## జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ



రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, చైర్మన్ వరప్రసాద్

**పులివెందుల రూరల్ :** జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద రోడ్డు భద్రతా నియమాల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రతత అవసరమన్నారు. అధిక లోడు, అధిక స్పీడ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పాత బస్టాండు మీదుగా కడప బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీఐ ప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, డేనియల్, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



ఎర్రగుంట్లలో ఇళ్లను పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్ రాంనాయక్

**ఎర్రగుంట్ల :** జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని స్పెషల్ కలెక్టర్ రాంనాయక్ తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల మున్సిపాలిటీ, మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ పీడీ క్రిష్ణయ్య, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వైవీ డేవిడ్‌లతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులకు గాను మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. ఇళ్లను జూన్ నెలాఖారుకు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సుబ్బయ్య, మున్సిపల్ ఆర్‌ఓ గంగిరెడ్డి, హౌసింగ్ శాఖ ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఇళ్లు నిర్మించుకుంటే వెంటనే నగదు జమ**

**మైలవరం (జమ్మలమడుగు రూరల్) :** జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకుంటే వారి బ్యాంక్ ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయడం జరుగుతుందని మైలవరం మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధి ఎం.కంబాలదిన్నె గ్రామంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి, గృహ నిర్మాణ శాఖ డీఈ విజయబాబుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడూతూ మండలానికి 1,958 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటిలో 220 పూర్తి కాగా, 1100కు పునాదులు వేసుకున్నారని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సొంతింటి కల సాకారానికి సీఎం కృషి

ఎంపీపీ ఎస్.లక్ష్మిగాయత్రి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి

**వేంపల్లె :** పేద ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు వేంపల్లె ఎంపీపీ ఎస్.లక్ష్మిగాయత్రి పేర్కొన్నారు. శనివారం స్థానిక వేంపల్లె ఎస్సీ కాలనీలో అధికారులు, ఇళ్ల లబ్ధిదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అంతకమునుపు ఎస్సీ కాలనీలో ఉన్న జగనన్న కాలనీ లేఔట్లను ఆమె పర్యవేక్షించారు. ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలపై చర్చిస్తూ అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు పటిష్టంగా అమలు చేస్తూ పేద, మధ్య తరగతి, అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. జగనన్న కాలనీలో మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం పునాదుల వరకు వేసి వదిలేసిన ఇళ్లను ఆ లబ్ధిదారునికి రద్దు చేసి కొత్త లబ్ధిదారునికి ఇవ్వడం జరుగుతుందన్నారు. వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమరెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఈఓపీ రవిశంకర్ రెడ్డి, నాయకులు జయరాములు, రామాంజనేయులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** గ్రామీణ నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఎస్ సొల్యూషన్ సెంటర్ హెడ్ యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఏవై–ఎన్‌యూఎల్‌ఎం, ఏపీ మెప్మా ద్వారా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. టెస్ట్ ఉత్తీర్ణులైన వారు బ్యూటిషియన్, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, టీవీ రిపేరు టెక్నిషియన్, ఇంటర్మీడియేట్ అర్హతతో లాగిస్టిక్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. 60–65 రోజులపాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 81060 59836, 99089 74770 నెంబర్లలో సంప్రదించాలన్నారు.